క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు



సీఎం జగన్‌ను కలిసిన వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్

గుంతకల్లుటౌన్: ఐదో విడత రైతుభరోసా పథకాన్ని ప్రారంభించేందుకు గురువారం కర్నూలు జిల్లా పత్తికొండకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ మర్యాదపూర్వకంగా కలిసారు. సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛంతో పాటు జ్ఞాపికను అందజేసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామపెద్దలు

గార్లదిన్నె: ముకుందాపురంలో వారం రోజులుగా జరిగిన క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో పెద్దవడుగూరుకు చెందిన అంబేడ్కర్ లయన్స్ జట్టు, ముకుందాపురానికి చెందిన గద్దలకొండ గణేష్ జట్టు తలబడ్డాయి. మొదటగా బ్యాటింగ్‌కు దిగిన అంబేడ్కర్ లయన్స్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసింది. గద్దలకొండ గణేష్ జట్టు 88 పరుగులకే ఆలౌట్ అయ్యింది. విన్నర్స్‌కు ట్రోఫీతోపాటు రూ.30 వేల నగదు, రన్నర్స్‌కు రూ.15 వేల నగదు గ్రామ పెద్ద చెన్నప్ప అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా వంశీకృష్ణ, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభి ఎంపికయ్యారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్ రోఫ్ మకాన్‌లో గురువారం ఆక్రమణలను తొలగించారు. జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా కట్టడాలు కూల్చివేశారు. మున్సిపాలిటీ అధికారులు గతంలోనే నోటీసులు ఇచ్చారు. అయితే నోటీసులకు స్పందన రాకపోవడంతో ఆక్రమణలు తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఏఈ శరత్‌చంద్ర, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఓకు సన్మానం



ఏపీఓను సన్మానిస్తున్న ఎంపీపీ యోగేశ్వరి, ఎంపీడీఓ

శింగనమల: ఉపాధి హామీ ఏపీఓగా పని చేస్తున్న శ్రీనివాసులు అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. దీనితో గురువార స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓను సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీపీ యోగేశ్వరి ఏపీఓ శ్రీనివాసులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామంలో గురువారం కుక్క దాడి చేయడంతో బాలుడు గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఆదిత్య అనే మూడేళ్ల బాలుడు అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క దాడి చేసి గాయపరిచింది. స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు వెంటనే ఆదిత్యను చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. ఇటీవల మండల వ్యాప్తంగా కుక్కలు దాడులు ఎక్కువయ్యాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పి.ఎర్రగుడిలో ఇరువర్గాల ఘర్షణ

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో చిన్నపాటి విషయంలో ఇరు వర్గాలు గురువారం ఘర్షణ పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన వెంకటమ్మ, కిష్టప్ప వర్గాలకు గతంలో పలు గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వెంకటమ్మ, కిష్టప్ప వర్గాల మధ్య చిన్నపాటి విషయంపై గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాట పెరిగి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘర్షణలో వెంకటమ్మ, నాగరత్నమ్మలకు గాయాలు కాగా వారిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద కూల్‌డ్రింక్స్ తాగుతున్న జనం



సీబీరోడ్డులో చెరకు రసం తాగుతున్న దృశ్యం

ఎండలు బాబోయ్

తాడిపత్రి టౌన్: పట్టణంలో భానుడి ప్రతాపం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం 9 గంటలకే ఎండ తీవ్రత పెరిగిపోతోంది. మధ్యాహ్నం అయితే జనాలు లేక ప్రధాన రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోజూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనాలు అల్లాడిపోతున్నారు. కాసింత నీడ కన్పిస్తే చాలు అక్కడే ఆగిపోతున్నారు. చెట్లు, గుళ్లు, పార్కులు.. ఇలా కాసింత చల్లగా ఉంటే చాలు అక్కడ వాలిపోతున్నారు. చెరకురసం, కొబ్బరి బోండాలు, మజ్జిగ, కూల్‌డ్రింక్స్ తదితర ద్రవ పదార్థాలు తీసుకుంటూ వేసవి నుంచి ఉపశమనం పొందుతున్నారు.



సుంకులమ్మపాలెంలో చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధురాలు



చింతల వెంకటరమణస్వామి ఆలయంలో సేదతీరుతున్న వ్యక్తులు

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

గార్లదిన్నె: పాఠశాలలు పునఃప్రారంభం నాటికి నాడు-నేడు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్ ఐఏఎస్ పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని ఇల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో రెండవ విడత చేపట్టిన నాడు-నేడు పనులను సివిల్ సప్లయ్ కమిషనర్ అరుణ్‌కుమార్ పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం నాటికి విద్యార్థులకు పనులు పూర్తి చేయాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం, గదుల నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు అని విద్యశాఖ అధికారులను అడుగగా పాఠశాలలో 180 మంది విద్యార్థులు ఉన్నారని తెలపడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యతక్కువగా ఉన్నారని భవిష్యత్తులో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తరగతి గదులు, గ్రౌండ్ ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలో తరగతి గదులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం మొక్కలు నాటారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్,డీఈఓ సాయిరాం,డీఎస్ శోభారాణి, ఓతహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ తేజోత్స్న,సర్పంచ్ జయరాం పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, సీఐటీయూ రాష్ట్ర నేత రాంభూపాల్ డిమాండ్ చేశారు. జగనన్న హామీల అమలు కోసం మున్సిపల్ కార్మికుల రాష్ట్ర ప్రచార జాతా గురువారం గుంతకల్లుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమానవేతనమివ్వాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, చనిపోయిన ఉద్యోగులు, కార్మికుల స్థానంలో వారి పిల్లలకు సకాలంలో ఉద్యోగాలివ్వాలన్నారు. మున్సిపల్ యూనియన్‌నేతలు నాగరాజు, లక్ష్మినారాయణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు రమేష్, నాయకులు జగదీష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఏర్పాటు

శింగనమల: తరిమెల గ్రామంలో గురువారం డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా సర్పంచ్ ఓబిలేసు, ఎంపీటీసీ రమేష్, సభ్యులుగా మాజీ సర్పంచ్ ఆదినారాయణ, నల్లప్ప, రామాంజనేయులు, వెంకట్, నారాయణ, చిరంజీవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో వివాదం లేని చోట స్థలం చూసి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

కమిషనర్‌గా మల్లికార్జున

గుంతకల్లుటౌన్: గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ధర్మవరం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ధర్మవరం కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వి.మల్లికార్జునను గుంతకల్లుకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న షేక్‌మాలిక్‌ను కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఈయన స్థానంలో కర్నూలు కార్పొరేషన్‌లో కార్యదర్శిగా పనిచేస్తున్న ఎస్.ఎన్.లావణ్యను నియమించింది. ఈయనతో పాటు అహుడా ఈఈగా పనిచేస్తున్న ఎన్.ఈశ్వరయ్యను గుంతకల్లు మున్సిపల్ ఈఈగా, సీనియర్ అసిస్టెంట్ ఎం.రవీంద్రను డోన్ మున్సిపాల్టీకి, అక్కడ పనిచేస్తున్న కె.స్వామిరెడ్డిని ఇక్కడి బదిలీ చేసింది.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం కొర్రపాడు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయానికి వచ్చే రోజువారి ఫిర్యాదులపై ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు, అర్జీలు, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పనులు కల్పించండి

యల్లనూరు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు తగినన్ని పనులను గుర్తించాలన్నారు. వర్కుఫైల్స్, మస్టర్లు, నేమ్‌బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏపీఓ షబ్బీర్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు తహసీల్దార్ బదిలీ

యల్లనూరు: తహసీల్దార్ రమాదేవిని ఉన్నతాధికారులు బుక్కరాయసముద్రానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో పుట్లూరు తహసీల్దార్ సుమతిని నియమించారు. గురువారం తహసీల్దార్ రమాదేవి రిలీవ్ అయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. యల్లనూరు పశు సంవర్ధకశాఖ కార్యాలయంలో పని చేస్తున్న అటెండర్ అనిల్ చుక్కలూరుకు బదిలీపై వెళ్లారు.

బుక్కరాయసముద్రం: తహసీల్దార్ మోహన్‌కుమార్ పుట్లూరు మండలానికి బదిలీ అయ్యారు. యల్లనూరు తహసీల్దార్‌గా పని చేస్తున్న రమాదేవి బీకేఎస్ తహసీల్దార్‌గా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్

గుత్తి రూరల్: తురకపల్లి గ్రామ వలంటీర్ రాజశేఖర్ గురువారం కర్నూలుకు వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ పంపిణీ చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కురవ ఆంజనేయులు అనే వృద్ధుడు కాలు విరగడంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ రాజశేఖర్ తన సొంత ఖర్చుతో గురువారం కర్నూలుకు వెళ్లి ఆసుపత్రిలో ఉన్న ఆంజనేయులుతో వేలి ముద్ర తీసుకొని పింఛన్ సొమ్ము రూ.2,750 అందజేశాడు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

తాడిపత్రి టౌన్: బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని సీడీపీఓ సాజిదాబేగం హెచ్చరించారు. స్థానిక టైలర్స్‌కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం బాల్య వివాహాలపై అవగాహన సమావేశం జరిగింది. సీడీపీఓ మాట్లాడుతూ 2005 బాల్య వివాహం చట్టం ప్రకారం 18 ఏళ్లు యువతికి, 21 ఏళ్లు యువకుడికి నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. 18 ఏళ్లలోపు యువతులకు వివాహం చేస్తే అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాల్య వివాహాలతో జరిగే ఇబ్బందులను తెలియజేశారు. టైలర్స్‌కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రీహరి, సీఓ పుల్లయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దస్తగిరమ్మ, కల్పన, అంగన్‌వాడీ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు: తిమ్మన చెరువులో గురువారం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనేయస్వామి భజన బృందం 108 ఏకాదశులు పూర్తయిన సందర్భంగా 108 కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

యువరైతు ఆత్మహత్య



మృతుడు మహేష్(30)

పామిడి: కత్రిమలలో ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన నడపి మారెన్న, చౌడమ్మ దంపతులకు ఐదుమంది సంతానంలో మహేష్(30) చివరివాడు. మహేష్ తన భార్య రూపా, ఏడాదిలోపు కుమారుడు పునీత్‌తో కలిసి తల్లిదండ్రుల వద్దనే ఉండేవాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులకు చెందిన ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. రెండేళ్లుగా పంటలు పండక దాదాపు రూ.7.5 లక్షల దాకా అప్పులయ్యాయి. ఈ క్రమంలో మద్యానికి బానిసై అయ్యాడు. దీనికి తోడు అన్నదమ్ముల నడుమ కుటుంబ కలహాలు ఉన్నాయి. తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

తాడిపత్రి టౌన్: చుక్కలూరు గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమంలో 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఆరుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు కంటి వైద్యాధికారి మధుసూదనరాజు తెలిపారు. ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారికి ఈనెల 12, 22, 26, 27, 28 తేదీల్లో అనంతపురం శారదానగర్‌లోని సంచార నేత్ర వైద్యశాలలో ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో చుక్కలూరు వైద్యాధికారి లావణ్య, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోండి

పెద్దవడుగూరు : మండలంలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్(ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్) జిల్లా సహాయ కార్యదర్శి రవీంద్ర కోరారు. ఈమేరకు గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ రాముడుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చాలా పాఠశాలలు ప్రజలను మభ్యపెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. నాయకులు ప్రతాప్‌కుమార్, గణేష్‌పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. వివరాలు.. నాలుగు రోజుల క్రితం అనంతపురానికి చెందిన నవీన్‌కుమార్(27) కోళ్ల వ్యాన్‌లో తీసుకొని పామిడి బయలుదేరాడు. 44జాతీయ రహదారి ముంటిమడుగు క్రాస్ వద్ద వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన నవీన్ నాయక్‌ను బెంగళూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేటి నుంచి పునః ప్రారంభం

పెద్దవడుగూరు : కేజీబీవీ పాఠశాలను శుక్రవారం నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఓ నజీమా గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 4 నుంచి ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులు తమ వస్తువులు, పుస్తకాలను వెంట తీసుకొని రావాలని సూచించారు. అలాగే ఈ నెల 12 నుంచి పాఠశాల విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కొత్తగా జాయిన్ అయ్యేవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు.

తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా రవి

తాడిపత్రి టౌన్: తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా జి.రవిని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గుంతకల్లు కమిషనర్ శేషన్న ఇన్‌చార్జ్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన నూతన కమిషనర్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

వార్డు సచివాలయాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని 10, 11వ వార్డు సచివాలయాలను గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు, సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్ల పని తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఈ శరత్ చంద్ర, అడ్మిన్ చంద్ర పాల్గొన్నారు.

శింగనమల ఏఓగా అన్వేష్‌కుమార్

శింగనమల: అన్నమయ్య జిల్లాలో టెక్నికల్ ఏఓగా పని చేస్తున్నఆన్వేష్‌కుమార్ శింగనమల ఏఓగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఏఓ ఆదిలక్ష్మి పని చేస్తుండగా, ఆమె అనంతపురంలోని ల్యాబ్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ల్యాబ్‌లో పని చేస్తున్న ఏఓ చిన్నమ్మ డిప్యూటేషన్‌పై ఇక్కడ పని చేస్తున్నారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

90 శాతం పింఛన్ల పంపిణీ



ఆకులేడులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమంలో భాగంగా జూన్‌కు సంబంధించి మున్సిపాలిటీ పరిధిలోని 9,656 మందికిగాను గురువారం 8,690 మందికి రూ.2,43,62,750 (90శాతం) పంపిణీ చేసినట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ శేషన్న తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పింఛన్ల పంపిణీలో తాడిపత్రి మున్సిపాలిటీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈసందర్భంగా ఆయన వలంటీర్లు, అధికారులను అభినందించారు.

శింగనమల: వైఎస్సార్ పింఛన్ కానుకను గురువారం నియోజకవర్గవ్యాప్తంగా 42,177 మందికిగాను 32,609 మందికి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలో 9,560 మందికి గాను 7945 మందికి, నార్పలలో 8,349 మందికి గాను 6,800 మందికి, పుట్లూరులో 5,094 మందికి గాను 4,061 మందికి, యల్లనూరులో 5,440 మందికి గాను 4,083 మందికి, శింగనమలలో 6,287 మందికి గాను 3,726 మందికి, గార్లదిన్నెలో 7,447 మందికి గాను 5,994 మందికి పంపణీ చేసినట్లు వివరించారు.

మాట నిలుపుకున్న ఎమ్మెల్యే

- పామిడమ్మ కమ్యూనిటీ హాల్‌కు రూ.10 లక్షల గ్రాంటు విడుదల



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సన్మానిస్తున్న పామిడమ్మ ఆలయ కమిటీ సభ్యులు

పామిడి: మండల కేంద్రంలో రెండునెలల క్రితం పామిడమ్మ వీధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.వెంకటరెడ్డి ఇచ్చిన హామీని గురువారం నెరవేర్చారు. ఆవీధిలో చేపట్టిన గడప గడపకు కార్యక్రమంలో స్థానికులు పామిడమ్మ ఆలయంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్(ఎస్‌డీఎఫ్) కింద రూ.10 లక్షలు గ్రాంటు విడుదల చేయించారు. దీనిపై ఎమ్మెల్యే పనితీరుపై పామిడమ్మ వీధి వాసులు హర్షం వ్యక్తంచేశారు. గురువారం గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వైవీఆర్‌కు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, సభ్యులు మస్తానయ్య, గొర్ల సుంకన్న, పిక్కిలి చిన్న రంగనాయకులు, 9వ వార్డు ఇన్‌ఛార్జ్ కత్రిమల శీనా, పామిడి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయ రామచంద్ర, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: నెలగొండ గ్రామంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి హాజరై స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. ముందుగా అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామికి పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిన దాత పారావిశ్వనాథ్, గుంతకల్లు మున్సిపల్ చైర్మన్ ఎన్ భవాని తదితరులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేయించారు. గ్రామ సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ నేత జయరామిరెడ్డి, ఎంపీపీ బీవీ మాధవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



హజ్ యాత్రికులను సన్మానిస్తున్న ఫయాజ్ బాషా

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీరోడ్డు మౌలానా అబ్దుల్ కలాం అజాద్ మున్సిపల్ షాదీఖానాలో గురువారం ఫయాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాడిపత్రి నుంచి హజ్ యాత్రకు వెళుతున్న 22 మంది హజ్ యాత్రికులకు ఫయాజ్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నేత హీరాపురం ఫయాజ్‌బాషా సన్మానించారు. అనంతరం ఫయాజ్ బాషా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల పక్షపాతి అని, ముస్లింల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. హజ్ యాత్రికులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పద్మవాణి స్కూలు కరస్పాండెంట్ నాగపీరయ్య, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, రియాజ్, హాజీవలి, గురుప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి



సంజీవరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: కల్లూరులో గురువారం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా నీలం సంజీవ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి ఇల్లూరులో రైతు బిడ్డగా జన్మించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా, భారదేశ రాష్ట్రపతిగా పని చేశారన్నారు. ఆయన జీవితం నుంచి యువత స్ఫూర్తి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ కోనారెడ్డి, ఏకే నరసింహులు, బృందావన్ రామాంజనేయులు, చీమల కేశవయ్య, రవికుమార్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరుకు కృషి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

పెద్దపప్పూరు: యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. గురువారం తాడిపత్రిలోని ఓ వివాహ వేడుకకు హాజరై యాడికి మీదుగా వెళుతుండగా ఎంపీపీ ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు ఎంపీని తమ ఇంటికి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రంలో విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక నాయకులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకుపోయి కళాశాల మంజూరు అయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.